క్లుప్తంగా

క్షీరబంధు చెక్కు అందజేత



రెడ్డిగూడెం: పాల ఉత్పత్తిదారులు కృష్ణా మిల్క్ యూనియన్‌లో పాలు పోసి యూనియన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని మద్దులపర్వ పాల కేంద్రంలో పాలు పోస్తున్న సభ్యురాలు గోదా సత్యవతి మరణించగా క్షీరబంధు పథకం కింద రూ.50 వేల విలువైన చెక్కును ఆమె భర్త గోదా మారేశ్వరరావుకు జెడ్పీటీసీ విజయభాస్కరరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ సభ్యులు, అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి, తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ టి. సాంబమూర్తి, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



రెడ్డిగూడెం: స్థానిక గీతాంజలి హైస్కూలులో 8, 9, 10 తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. విస్సన్నపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ అన్నపురెడ్డి కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని సరైన ప్రణాళికతో అంకితభావంతో పనిచేస్తే లక్ష్యాలు సాధిస్తారన్నారు. విద్యార్థులతో ఇంటరాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విస్సన్నపేట లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వి. శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కోటిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: స్థానిక వికాస్‌జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా చైర్‌పర్సన్ ఎం.సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం కష్టపడుతూ జ్ఞానాన్ని పెంపొందించుకునినూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖుడు రాజారావు మృతి



తిరువూరు: తిరువూరు ఆర్యవైశ్య సంఘ ప్రముఖుడు కంచర్ల రాజారావు (86) బుధవారం రాత్రి మృతిచెందారు. చాంబర్ ఆఫ్‌కామర్స్ పూర్వ అధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంచర్ల ముత్యప్రసాద్ తండ్రి రాజారావు. తిరువూరులో శ్యామవేది రాధాకృష్ణుల మందిర నిర్మాణంలో రాజారావు విశేష కృషి చేశారు. ఆర్యవైశ్య సంఘంలో ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా 15 సంవత్సరాలు సేవలందించారు. రాజారావుకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. ఆయన మృతికి ఆర్యవైశ్య సంఘ సభ్యులు సంతాపం తెలిపారు. రాజారావు అంత్యక్రియలు గురువారం తిరువూరులో నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చాట్రాయి: పొలంలో పురుగుమందు పిచికారీ చేస్తూ ఆ ప్రభావానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిత్తపూరు పడమట ఎస్సీ ఏరియాకు చెందిన కడవటి ఇశ్రాయేలు (35) బుధవారం ఓ రైతుకు చెందిన పత్తి తోటలో పురుగుమందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. ఆ రాత్రి ఇశ్రాయేలు ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం తోటలోకి వెళ్లి చూడగా ఇశ్రాయేలు చనిపోయి ఉన్నాడు. రవి పోలీసులకు సమాచారం అందించాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టిడ్కో గృహాలను జనవరిలోగా ఇవ్వండి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పట్టణ పరిధిలో టిడ్కో గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి జనవరిలోగా లబ్ధిదారులకు అందజేయాలని ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సూచించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడ్కో ప్లాట్లను లబ్ధిదారులకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఈ నేపథ్యంలో టిడ్కో గృహాల పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నూజివీడులో మొత్తం 2,640 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. 60 శాతం నుంచి 80 శాతం వరకు నిర్మాణ పనులు పూర్తి చేసినందున మిగిలిన పనిని త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే లబ్ధిదారులందరికీ బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయన్నారు. 300 చదరపు అడుగుల ప్లాట్లు పొందిన లబ్ధిదారులకు ప్రభుత్వం రూపాయికే ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. పేదలకు మంచి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నందున ఎల్ అండ్‌టీ కంపెనీ సాధ్యమైన మేరకు వేగంగా పనులు పూర్తి చేసి టిడ్కో గృహాలను అప్పగించాలన్నారు. ఎల్‌అండ్‌టీ కంపెనీ ఫైనాన్స్ హెడ్ గాదె రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చొరవతో వచ్చే ఏడాది జనవరి కల్లా టిడ్కో గృహాల పెండింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు. దీనికి గాను దీపావళి పండుగ తరువాత నుంచి పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని తెలిపారు. టిడ్కో గృహాలను షీర్ వాల్ టెక్నాలజీతో జీ3 ప్లాన్‌తో నిర్మించామన్నారు. వీటిల్లో 300 చదరపు అడుగులు, 360 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల వైశాల్యం కలిగిన ప్లాట్‌లు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, ఎల్‌అండ్‌టీ టెక్నికల్ హెడ్ వసంతకుమార్, కో-ఆర్డినేటర్ మణికంఠన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులు

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గుంటూరు లాంఫామ్ శాస్త్రవేత్త శిరీష

పెనుగొలను(గంపలగూడెం): మిరప సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గుంటూరు లాంఫామ్ శాస్త్రవేత్త కే శిరీష రైతులకు సూచించారు. మిరప పరిశోధన సంస్థ, సుగంధ ద్రవ్యాల సంస్థ గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం గంపలగూడెం మండలం పెనుగొలను రైతు భరోసా కేంద్రంలో మిరప రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మిరపకు ప్రధానంగా ఎండు, వేరు, కుళ్లు, బొబ్బ, తెగుళ్లు ఆశించాయన్నారు. వీటికి ప్రధాన కారణమైన తెల్లదోమ నివారణకు చేపట్టాల్సిన చర్యలను ఆమె వివరించారు. మిరప ఎగుమతుల కోసం పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలను శాస్త్రవేత్త కేవీ సౌజన్య వివరించారు. సర్పంచ్ సంగెపు లలిత, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ, తిరువూరు ఏడీఏ కెనడీ, మండల వ్యవసాయ అధికారి సాయిశ్రీ, తిరువూరు ఉద్యాన శాఖ అధికారి సోహెల్ అహ్మద్, పలువురు వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



పెనుగొలనులో రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త శిరీష

పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించండి

నూజివీడు: పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానిక హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి అన్నారు. మన గ్రామం-మన విశ్వవిద్యాలయం కార్యక్రమంలో భాగంగా పాలిటెక్నిక్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గురువారం దత్తత గ్రామమైన మిట్టగూడెంలో పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. వీరితో పాటు ఎమ్మార్ అప్పారావు కాలనీ వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం రసాయన రహిత కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు పండించాలన్నారు. రసం పీల్చు పురుగుల నివారణకు వేపగింజల కషాయాన్ని ఉపయోగించాలన్నారు. గురుకుల పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థినులకు శీతాకాలం సాగు చేసే కూరగాయల గురించి వివరించి వంగ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, తీగజాతి కూరగాయల విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, హార్టికల్చర్ పాలిటెక్నిక్ బోధన సిబ్బంది పద్మజ, కంచన, భవాని, వాకా శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాలు మానుకోవాలి

వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు

ముసునూరు: నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌పై అసత్య కథనాలు, దుష్ప్రచారాలు మానుకోవాలని మండల వైఎస్సార్ సీపీ నేతలు సూచించారు. ముసునూరులో పార్టీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన గురువారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ పదవిపై ఓ పచ్చ పత్రికలో వెలువడిన కథనంపై వారు మండిపడ్డారు. తాత్కాలిక ఎంపీపీ రాజానాయన, రమణక్కపేట ఎంపీటీసీ కొండా దుర్గాభవాని మాట్లాడుతూ ముసునూరు ఎంపీపీ పదవి విషయంలో ఎటువంటి తేడాలు జరగలేదని, అపోహలకు తావు లేదని కార్యవర్గ ఎన్నిక ముందు ఏర్పాటు చేసుకున్న ఒప్పందం ప్రకారమే ఎంపీపీ పదవికి రాపర్ల కృష్ణకుమారి రాజీనామా సమర్పించారన్నారు. ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారమే కృష్ణా జిల్లా సీఈఓ, ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మాత్రమే ప్రస్తుత వైస్ ఎంపీపీ రాజానాయన తాత్కాలిక ఎంపీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు వచ్చిన మరుక్షణమే ఎంపీపీగా దుర్గాభవానీని ఎన్నుకుంటామన్నారు. పార్టీ అగ్ర, మండల నేతల్లో ఎటువంటి మోసపూరిత ఆలోచన లేదన్నారు. ఆరోపణ చేసేముందు ఎదుటివారి అభిప్రాయాలు తీసుకోవాలన్న సూత్రాన్ని పాటించకపోవడం విచారకరమన్నారు. జెడ్పీటీసీ సభ్యులు డాక్టర్ వరికూటి ప్రతాప్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ పి.గంగాధర్, సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పుచ్చకాయల వెంకటేశ్వరరావు, చీలి లక్ష్మీ అర్లప్ప నేతలు పాల్గొన్నారు.



ముసునూరులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

నేడు శివాలయంలో విగ్రహాల ప్రతిష్ట

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం (శివాలయం)లో శుక్రవారం ఉదయం 10.43 గంటలకు నవగ్రహాలు, ప్రసన్నాంజనేయస్వామి, కాలభైరవ, జంట నాగేంద్రుస్వాముల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంతోపాటుగా శిఖర ప్రతిష్ఠకూడా జరుగనుంది. ఈ సందర్భంగా రెండో రోజు గురువారం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవంలో చివరి రోజు శుక్రవారం ఉదయం 6 గంటలకు పుణ్యాహవచనం తదితర కార్యక్రమాల అనంతరం శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. ప్రతిష్టాచార్యులు తుర్లపాటి ఉమామహేశ్వర శర్మ (ఈశాన్య శివాచార్య) నేతృత్వంలో విగ్రహాల ప్రతిష్ఠ, ఉదయం 11.30 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని గొల్లపూడిలోని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



హాజరు నమోదు పెంచడమే లక్ష్యం

కృష్ణా డీఈవో తాహెరా సుల్తానా

ఆగిరిపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం విద్యార్థుల హాజరు నమోదుతో పాటు విద్య కొనసాగింపు లక్ష్యమే ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ 124 రోజుల శిక్షణా కార్యక్రమం లక్ష్యమని కృష్ణా డీఈవో తాహెరా సుల్తానా అన్నారు. మండలంలోని తోటపల్లిలోని హీల్ పారడైజ్ స్కూల్ ఆవరణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు, ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన జిల్లా రిసోర్స్ పర్సన్స్‌కు నిర్వహిస్తున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ 124 రోజుల శిక్షణలో నాలుగోవ రోజు కార్యక్రమాలను గురువారం డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తప్పనసరిగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర అకడమిక్ జాయింట్ డైరెక్టర్ బి.ఉదయ భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమం భవిష్యత్తులో నూటికి నూరుశాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరడంతోపాటు వివిధ అభ్యసనా ప్రక్రియలు, కృత్యాలను బట్టి విద్యను ఆసక్తితో నేర్చుకోవడానికి వీలవుతుందన్నారు. రెండో తరగతి స్థాయిలోనే విద్యార్థులకు మంచి పునాది వేయడం జరుగుతుందన్నారు. గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారిణి శైలజారెడ్డి, ఏసీపీ విజయలక్ష్మి, రిసోర్స్‌పర్సన్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో శిక్షణ తరగతులను సందర్శించిన కృష్ణా డీఈవో తాహెరా సుల్తానా

ఏఎంసీలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం



మైలవరం: స్థానిక మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను గురువారం ప్రారంభించారు. పూజలు నిర్వహించిన అనంతరం ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి పత్తి కొనుగోళ్ల ప్రారంభించారు. మైలవరం నియోజకవర్గంలో 9,500 ఎకరాల్లో పత్తి రైతులు పండించారు. గత ప్రభుత్వ హయాంలో పత్తి ధర లేక రైతులు కుదేలయ్యారు. ఈ ఏడాది పత్తి ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు పత్తి సాగుకు మొగ్గు చూపారు. పత్తి క్వింటా రూ.7020 మద్దతు ధర పలికింది. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



వేమిరెడ్డిపల్లి (విస్సన్నపేట): విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెరగటానికి చెకుముకి సైన్స్ సంబరాలు దోహదపడతాయని వేమిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం పి.రవి అన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలు-2023 పోస్టర్‌ను జెడ్పీ హైస్కూల్లో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎం.జి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.రామారావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సరిచూసుకోండి

ఏ.కొండూరు: ఓటర్ల జాబితాలో పేర్లు మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉందని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. గతనెల 27న విడుదలైన ఓటర్ల జాబితాలో పేర్లు సరిచూసుకొని వాటిలో ఏమైన తేడాలు ఉంటే ఈనెల 4, 5 తేదీల్లో ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లను నమోదు చేసుకోవటానికి కొత్త దరఖాస్తు చేసుకోవాలని ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఆగిరిపల్లి: మండలంలోని ఈదరలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని, రెండు సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం ప్రారంభిస్తారని ఎంపీడీవో పీ శంకరరావు గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రభుత్వశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రేపు సచివాలయ భవనం ప్రారంభం

విస్సన్నపేట: మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

తిరువూరు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఎమ్మెల్యే రక్షణనిధి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

పాక్షిక కరువు మండలాల గుర్తింపు

తిరువూరు: ఖరీఫ్ సీజన్లో సగటు వర్షపాతం నమోదు కాక, పంటలు ఎండిపోతుండటంతో తిరువూరు, గంపలగూడెం మండలాలను రాష్ట్ర ప్రభుత్వం పాక్షిక కరువు మండలాలుగా ప్రకటించిందని మండల వ్యవసాయాధికారి వి.పద్మ తెలిపారు. తిరువూరు మండలంలో ఖరీఫ్ సీజన్లో సగటు వర్షపాతం 28.9 సెంటీమీటర్లు కాగా, 5.67 సెంటీమీటర్లు మాత్రమే కురిసింది. గంపలగూడెం మండలంలో 29.6 సెంటీమీటర్ల సగటు వర్షపాతానికి గాను 10.7 సెంటీమీటర్లు కురిసింది. విస్సన్నపేట, ఏకొండూరు మండలాల్లో కూడా అత్యల్ప వర్షపాతం నమోదైంది. సాగునీటి సమస్యతో సగం విస్తీర్ణంలో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొనగా ఇటీవల డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు కూడా ఖరీఫ్ పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ప్రభుత్వం జారీ చేసే నియమ నిబంధనల మేరకు వరి, మిర్చి, పత్తి తదితర పంటలకు కలిగిన నష్టాన్ని అంచనా వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం: మైలవరం నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని వివిధ ప్రాంతాల్లో రాజ్యసభ ఎంపీ నిధులు రూ.75 లక్షలతో నిర్మించిన మూడు సామాజిక భవనాలు, రూ.40 లక్షలతో నిర్మించిన వార్డు సచివాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అడిగిన వెంటనే అప్పటి రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరి మంజూరు చేసిన రూ.2.50 కోట్లతో 10 కమ్యూనిటీ హాల్స్ తోపాటు నియోజకవర్గంలో 30 కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇంటింటికీ కుళాయికి ప్రభుత్వం రూ.57 కోట్లు గతంలో మంజూరు చేసిందని టెండర్ల ప్రక్రియ దాటిన వెంటనే పనులు పూర్తిచేస్తామన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమా గతంలో షాదీఖానా నిర్మిస్తానని ముస్లింలకు మొండిచేయి చూపారన్నారు. గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి షాదీఖానా నిర్మించడంతో ముస్లిం పెద్దలతో పాటు టీడీపీ ముస్లిం నేతలు సైతం ఎమ్మెల్యే వసంత పనితీరు ప్రశంసించి ఘనంగా సత్కరించారు.

అభివృద్ధి నిరోధకుడు దేవినేని ఉమా..

మాజీమంత్రి దేవినేని ఉమాపై ఎమ్మెల్యే వసంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక వ్యక్తిగత దూషణలు చేయడం ఉమాకే చెల్లిందన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించనందున ఈరోజు మేము 20 వేల ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, మతగురువు ఆల్తాఫ్ రజా, మసీదు కమిటీ సభ్యులు, వార్డు కౌన్సిలర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



షాదీఖానా ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ప్రజా ప్రతినిధులు

క్రీడా పరికరాల పంపిణీ

చాట్రాయి: మండలంలోని మర్లపాలెం జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు క్రీడా పరికరాలను ఎంఈవో వి.బ్రహ్మాచారి గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన వందనపు సురేష్‌కుమార్ విద్యార్థులకు క్రీడా పరికరాలు బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ సమకూర్చగా వీటిని ఎంఈవో అందజేశారు. అంతకు ముందు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఎక్కువ ర్యాంకులు సాధించాలని సూచించారు. భోజనంలో నాణ్యత లోపిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్ఎం బక్కయ్య, పీఈటీ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎంఈవో

ఎమ్మెల్యే పరామర్శ

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీ 14వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లమోతు రవి మాతృమూర్తి, 14వ వార్డు కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మి అత్త అయిన నల్లమోతు మరియమ్మ అనారోగ్యంతో ఇటీవల కాలంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గురువారం రవి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరియమ్మ ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రవి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ఆగిరిపల్లి: మండలంలోని రౌడీ షీటర్లందరూ సత్ప్రవర్తన కలిగి, మంచి నడవడికతో మెలగాలని ఎస్ఐ నంబూరు చంటిబాబు సూచించారు. మండలంలోని రౌడీషీటర్లకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నా, శాంతికి విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లందరూ వారానికొకసారి పోలీస్‌స్టేషన్‌కు రావాలని, ఊరు దాటి వెళితే తెలియపరచాలన్నారు. సత్ప్రవర్తనను కలిగి ఉన్నట్లయితే రౌడీషీట్ తొలగించడానికి ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నంబూరు చంటిబాబు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

మైలవరం: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్. మేఘన తన ప్రతిభ కనబర్చి ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్యామ్ సుందరరావు తెలిపారు. మైలవరంలోని పాఠశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జరిగిన పోటీల్లో మేఘనను ఎంపిక చేశారన్నారు. గత వారం గుడివాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 ఖోఖో పోటీల్లో బి.మౌనిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. త్వరలో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను వ్యాయామోపాధ్యాయుడు కే వెంకయ్య, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.